


సాటాపూర్ గ్రామంలో రేకుల షెడ్డులో ఆరోగ్య ఉప కేంద్రం




అన్ని హంగులతో నిర్మించిన నూతన ఆరోగ్య ఉప కేంద్రం భవనం

# నాడు రేకుల షెడ్డు.. నేడు పక్కా భవనం

రెంజల్, అక్టోబర్3: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేవి. ఆశించిన స్థాయిలో నిధులులేక ప్రభుత్వ దవాఖానలు అధ్వానంగా ఉండేవి. పేదలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకునేవారు. కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నది. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలు, కార్యాలయాలకు పక్కా భవనాలను అన్ని సౌకర్యాలతో నిర్వహిస్తున్నారు. ప్రజలకు సేవలు చేరువయ్యాయి. మండలంలోని సాటాపూర్ గ్రామంలో గతంలో గ్రామ పంచాయతీ కేటాయించిన ఒక రేకుల షెడ్డులో హెల్త్ సబ్ సెంటర్ కొనసాగేది. అందులోనే ప్రజలకు వైద్య పరీక్షలు, పిల్లలు, గర్భిణులకు టీకాలు ఇచ్చేవారు. రోగులకు వైద్య పరీక్షలు కూడా అందులోనే చేయాల్సి వచ్చేది..

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రభుత్వం నూతనంగా అన్ని హంగులతో పక్కా భవనం నిర్మించడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఎంఎస్‌డీపీ నిధులు రూ.22.48లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని జూన్ 15న బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు, ఇద్దరు ఏఎన్ఎంలు, నలుగురు ఆశ వర్కర్లు సేవలు అందిస్తున్నారు. భవనంలోని ఐదు గదుల్లో గర్భిణు, బాలింతలకు వేర్వేరుగా వైద్య పరీక్షలు నిర్వహించడ, చిన్న పిల్లలకు టీకాలు ఇప్పించడం, అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి కావాల్సిన వారికి మందులను పంపిణీ చేస్తున్నారు.

## నేడు మండలంలో మంత్రి వేముల పర్యటన

భీమ్‌గల్, అక్టోబర్3: మండలంలో బుధవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు రూప్లా తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూప్ల తండా నుంచి చేంగల్ వరకు బీటీ రోడ్డు అభివృద్ధి పనుల శంకుస్థాపన, రూప్ల తండా నుంచి బడాభీమ్‌గల్ రోడ్డు పునరుద్ధరణ, ఉదయం 10:30 గంటలకు ఎంజితండా గ్రామపంచాయతీ నుంచి బడాభీమ్‌గల్ బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన, ఉదయం 11 గంటలకు మండలంలోని సికింద్రాపూర్‌లో సికింద్రాపూర్ నుంచి బెజ్జోరా వరకు బీటీ రోడ్డు అభివృద్ధికి, బెజ్జోరా సికింద్రాపూర్ రోడ్డు కప్పల వాగుపై రోడ్డు డ్యామ్ నిర్మాణ పనులకు, ఉదయం 11.45 గంటలకు భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. బెజ్జోరా నుంచి సికింద్రాపూర్ వరకు బీటీ రోడ్డుకు , భీమ్‌గల్ నుంచి తూంపల్లి రోడ్డు వయా బెజ్జోరా రోడ్డు పనులకు, బెజ్జోరా సికింద్రాపూర్ రోడ్డు కప్పల వాగుపై డ్యామ్ నిర్మాణ, మధ్యాహ్నం 12.30 గంటలకు భీమ్‌గల్ ముచ్కూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. భీమ్‌గల్ నుంచి తూంపల్లి రోడ్డు వయా బెజ్జోరా, ముచ్కూర్ రోడ్డు పనుల శంకుస్థాపనకు, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో మధ్యాహ్నం 3 గంటలకు బాబానగర్‌లో నాబార్డు గోడౌన్ కాంపౌండ్ వాల సీసీ ప్లాట్‌పామ్, గోడౌన్ మెయిన్ రోడ్డు సీసీగా మార్పు పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు కారేపల్లిలో కారేపల్లి నుంచి రహత్‌నగర్ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4.30 గంటలకు కొత్త తండాలో రహత్‌నగర్ రింగ్ రోడ్డు పునరుద్ధరణ వయా కొత్త తండా, 5.30 గంటలకు జాగిర్యాల్‌లో మోర్తాడ్ భీమ్‌గల్ రోడ్డు 12 నుంచి 16/5 వరకు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య కోరారు.

## జాగ్రత్తలు తీసుకోవాలి

ఏర్గట్ల, అక్టోబర్ 3: గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల డిప్యూటీ మెడికల్ అధికారి మారుతి గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాల్లో మురికి నీటి నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. శుభ్రత పాటించక పోతే దోమల బెడద పెరిగి మలేరియా, టైఫాడ్, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పండరి, ఏఎన్ఎం కల్పన తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'ఉపాధి హామీ' ప్రజావేదిక

ఎడపల్లి, అక్టోబర్ 3: మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అధ్యక్షతన ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపాల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రజాప్రతినిదులు, సంబంధిత శాఖ అధికారులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

# ముస్లిం మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



బాల్కొండలో కుట్టుమిషన్లతో ముస్లిం మహిళలు

బాల్కొండ, అక్టోబర్ 3: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మైనార్టీ మహిళలకు ఎంపీపీ లావణ్యా లింగాగౌడ్, ప్రజాప్రతినిధులు కుట్టుమిషన్లను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి సహకారంతో మండలంలోని 78 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేశామన్నారు. మండలంలోని బాల్కొండకు 30, కిసాన్‌నగర్‌కు 19, చిట్టాపూర్‌కు 5, జలాల్‌పూర్‌కు 4, నాగపూర్‌కు 5, బస్సాపూర్‌కు 2, ఇత్వార్ పేట్‌కు 5, బోదేపల్లికి 5, వన్నెల్(బి) 5, శ్రీరాంపూర్‌కు నాగపూర్‌కు 2, మొత్తం 78 కుట్టుమిషన్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీలు రామరాజుగౌడ్, లింగవ్వా పోశెట్టి, మండల కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మైనార్టీ నాయకులు షేక్ వాహబ్, ఇఫ్తేఖార్, షేక్ రహీమొద్దీన్, షాహీద్, మజారుద్దీన్, సయ్యద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బుస్సాపూర్‌లో హెల్మెట్ల పంపిణీ



బుస్సాపూర్‌లో హెల్మెట్లను అందజేస్తున్న నాయకులు

మెండోరా, అక్టోబర్3: మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంత డబ్బులతో అందజేసిన హెల్మెట్లను ఉపసర్పంచ్ గోపిడి గంగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారు హెల్మెట్లు ధరించి భద్రతగా ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, రజిత్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అరెస్ట్ శోచనీయం

### బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్, అక్టోబర్ 3: ఏపీలో కక్షపూరిత రాజకీయం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాజీ సీఎం చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయించడం శోచనీయమని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో చంద్రబాబు నాయుడు అరెస్ట్‌పై నిరసన వ్యక్తం చేస్తూ పార్టీలకు అతీతంగా అభిమానులు చేస్తున్న రిలే రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఎమ్మెల్యేవెంట బోధన్ ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూదోట రవికిరణ్, డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌రెడ్డి, పార్టీ నాయకుడు బుద్దె రాజేశ్వర్ ఉన్నారు. రిలే దీక్షలో పల్లెంపాటి శివన్నారాయణ, బీఆర్ఎస్ సాలూరా మండల అధ్యక్షుడు గోగినేని నరేంద్రబాబు (నర్సన్న), పావులూరి వెంకటేశ్వర్ రావు, రామ్మోహన్, సిర్ప సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు, నాయకులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 3: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌కు ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె. శంకర్ గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజమణి, సీఐటీయూ నాయకులు జంగం గంగాధర్, ఏశాల గంగాధర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## 'క్రీడల్లో ఓడిన వారు గెలుపుకోసం మరోసారి ప్రయత్నించాలి'



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బాల్కొండ, అక్టోబర్ 3: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని మండల క్రీడా మైదానంలో కొబ్బన్నగారి చిన్నయ్యగారి మెమోరియల్, 67వ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ లావణ్యా లింగాగౌడ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహపడకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. గెలిచిన వారు మరిన్ని బహుమతులు గెలిచేలా ప్రయత్నం చేయాలన్నారు. టోర్నమెంట్‌కు దాతలైన డాక్టర్ బద్దం రమేశ్‌రెడ్డి, డాక్టర్ గౌతమిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు భవిష్యత్తులో మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సంగీతరావు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 1100 మంది క్రీడాకారులు 100 మంది అఫీషియల్స్ పాల్గొన్నారని, ఇంత చక్కటి టోర్నమెంట్లను నిర్వహించిన రాజ్‌కుమార్ పీడీని ఎస్‌జీఎఫ్ తరపున అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.సంగీతరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జైడి రాజ్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కమిటీ మెంబర్లు బి.మల్లేశ్‌గౌడ్, ప్రేమలత, మార్కంటి గంగామోహన్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.